ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 25 ఫిబ్రవరి 2024





సమ్మక్కను వనంలోకి తీసుకెళుతున్న కోయపూజారులు



గద్దెల వద్ద మొక్కుతున్న భక్తులు

తల్లుల వన ప్రవేశం

- తిరుగు పయనమైన భక్తులు
- ముగిసిన సమ్మక్క-సారలమ్మ జాతర

పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు రోజులుగా జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర శనివారం సాయంత్రం ఆ తల్లులు వన ప్రవేశంతో ముగిసింది. శుక్రవారం రోజునే పెద్దఎత్తున సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు సమర్పించగా, శనివారం మరికొంత మంది మొక్కులు సమర్పించారు. ఇంటిల్లి పాది తమను చల్లంగా చూడాలని ఆ తల్లులకు మొక్కు కున్నారు. జిల్లాలోని గోదావరిఖని, గోలివాడ, నీరుకుళ్ల, మీర్జంపేట, కొలనూర్, హన్మంతుని పేట తదితర గ్రామాల్లో జాతరలకు అధికంగా భక్తులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన జాతరలకు 6లక్షల మందికి పైగా భక్తులు వచ్చినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ప్రశాంతంగా ముగి సింది. జాతర సందర్భంగా పెద్దఎత్తున కొబ్బరికాయలు, బెల్లం, కోళ్లు, మేకలు, మాంసం, లిక్కర్ అమ్మకాలు జోరుగా సాగాయి. ఒక్కో కుటుంబం జాతర పేరిట 3 వేల నుంచి 10 వేల రూపాయలకు పైగా వెచ్చించారు. కొందరు వ్యాపారులు ఇదే అదనుగా భావించి ధరలు పెంచి కొబ్బరి కాయలు, బెల్లం, కోళ్లు, మేకలు విక్రయించి సొమ్ముచేసుకున్నారు. జాతరల సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో కూడా వ్యాపారం జోరుగానే జరిగింది.

కోల్‌సిటీ: గోదావరిఖని గోదావరి తీరాన మూడు రోజుల పాటు జరిగిన జాతర సమ్మక్క-సారలమ్మల వనప్రవేశంతో ముగిసింది. శనివారం రాత్రి కోయపూజారులు గద్దెలపై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను వన ప్రవేశానికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా భక్తులు పొర్లుదండాలు పెట్టారు. వారిపై నుంచే దేవతలను తీసుకువెళ్లారు. సమ్మక్కను జనగామకు, సారలమ్మను గోదావరిఖని టీగెస్ట్‌హౌస్ సమీపంలోని ఆలయానికి పంపించారు. జాతరకు సుమారు 5 లక్షలకుపైగా భక్తులు వచ్చారని అంచనా. అనంతరం జాతరలోని హుండీలను బీ గెస్ట్ సమీపంలోని కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, బంగారి రాజయ్య, మోహన్‌రెడ్డి, కనకయ్య, ఈఓ కాంతారెడ్డి పాల్గొన్నారు. కాగా, మూడు రోజులుగా గోదావరితీరంలో జరిగిన సమ్మక్క - సాలరమ్మ జాతర శనివారం రాత్రి ముగిసింది. శనివారం ఉదయం నుంచే భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణం కాగా చాలా మంది భక్తులు సాయంత్రం వరకు మొక్కులు చెల్లించుకున్నారు. వనదేవతలను రాత్రి వన ప్రవేశం చేయించాక జాతర ప్రాంతంలో వెలసిన దుకాణాల సముదాయాల నిర్వాహకులు కూడా తిరుగుపయానమయ్యారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని తుర్కలమద్దికుంట, పెద్దకల్వల, హన్మంతునిపేట గ్రామాల్లో నిర్వహించిన వనదేవల జాతర శనివారంతో ముగిసింది. సాయంత్రం సమ్మక్క-సారలమ్మను కోయ పూజారులతో వనప్రవేశం చేయించారు. హన్మంతునిపేటలో జాతర హుండీలను లెక్కించారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ పోల్సాని సుధాకర్‌రావు, మాజీ సర్పంచ్ తీగల సదయ్య, నాయకులు బయా కోమురయ్య పాల్గొన్నారు. తుర్కలమద్దికుంటలో అమ్మవార్లను ప్రత్యేక పూజలు చేసి వనప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్యతో పాటు జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎలిగేడు : ఎలిగేడు, లాలపల్లి పొలిమేరలోని పెల్లిపోరు గుట్టపై సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం కోయపూజారులు ప్రత్యేక పూజల అనంతరం పెల్లిపోరుగుట్టపై అమ్మవార్ల వనప్రవేశం చేయించారు. రెండురోజుల్లో హుండీ లెక్కింపు చేపడతామని జాతర కమిటీ చైర్మన్ సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు.

ధర్మారం : మండలంలోని ధర్మారం, ఎర్రగుంటపల్లి, కటికెనపల్లి, కొత్తూర్, నందిమేడారం, బొట్లవనపర్తి, దొంగతుర్తి, చామనపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజల తర్వాత వనదేవతలను కోయ పూజారులు వనప్రవేశం చేయించారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత హుండీలను నిర్వహకులు లెక్కింపు చేశారు. కాగా, మేడారంలో వనదేవతులను శనివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఎత్తు బంగారం (బెల్లం)ను సమర్పించారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని రాణాపూర్, వేమునూర్, ఈసాలతక్కళ్ళపల్లి గ్రామాల్లో సమ్మక్క, సారలమ్మను శనివారం కోయపూజారులు వనప్రవేశం చేయించారు. ఈసాలతక్కళ్ళపల్లి జాతర హుండీ లెక్కింపు ఆదివారానికి వాయిదాపడింది.అప్పటివరకు కమిటీ సభ్యులతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది హుండీలకు సైతం రక్షణగా ఉండనున్నారు.

జూలపల్లి : మండలంలోని తెలుకుంట, అబ్బాపూర్ గ్రామాల్లో నిర్వహించిన సమ్మక్క, సారలమ్మల జాతర శనివారం ముగిసింది. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం కోయ పూజారులు సమ్మక్క, సారలమ్మను వనప్రవేశం చేయించారు. ఆయా గ్రామాల ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు జాతర హుండీ లెక్కింపు

కళ్యాణ్‌నగర్ : గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ జాతర హుండీ లెక్కింపు సోమవారం గోదావరిఖని బీ గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న సారలమ్మ ఆలయంలో లెక్కించనున్నట్టు ఈవో కాంతారెడ్డి తెలిపారు. ఆసక్తిగల భక్తులు ఉదయం 10 గంటలకు గుడి వద్ద హుండీ లెక్కిపులో పాల్గొనవచ్చని తెలిపారు.



ఖనిలో గద్దెల వద్ద మొక్కుతున్న కుటుంబ సభ్యులు



తుర్కలమద్దికుంటలో అమ్మవార్ల వన ప్రవేశం..



ధర్మారంలో అమ్మవార్ల వన ప్రవేశం..



మేడారంలో బంగారం మొక్కు చెల్లించుకుంటున్న అడ్లూరి



హన్మంతునిపేటలో హుండీల లెక్కింపు

మార్చి నుంచి 'గృహజ్యోతి'..

- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు రంగం సిద్ధం - వివరాల సేకరణ పూర్తి
- రూ.500కే గ్యాస్ సిలిండర్ - వచ్చేనెల నుంచి ప్రారంభించనున్న ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల హామీలో భాగంగా మార్చి నుంచి 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ కనెక్షన్ ఇచ్చే 'గృహజ్యోతి' పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఇప్పటికే జిల్లాలో విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి విద్యుత్ మీటర్ల వివరాలను సేకరించారు. గ్యాస్ సిలిండర్ కనెక్షన్‌దారుల వివరాలు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉండడంతో వాటి ఆధారంగా సబ్సిడీని అందజేయనున్నారు. ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సరఫరాకు సంబంధించి మార్గదర్శకాలకు రెండు, మూడు రోజుల్లో విడుదల చేయనున్నారు. వాటి ఆధారంగా గృహజ్యోతి పథకాన్ని అమలు చేయనున్నారు. నవంబర్ నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను గెలుచుకుని ప్రభుత్వాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో డిసెంబర్ 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్య సదుపాయాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామ, పట్టణ సభలను నిర్వహించి ఐదు గ్యారంటీ పథకాలకు ఒకే నమూనాలో రూపొందించిన దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించింది. మార్చినెల నుంచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేసేందుకు గాను ఈనెల 17వ తేదీ వరకు విద్యుత్ సిబ్బంది ఇంటింటికి తిరిగి విద్యుత్ మీటర్ల వివరాలను సేకరించారు. ఒక గృహంలో రెండు మీటర్లు ఉంటే రెండింటి వివరాలను తీసుకున్నారు. యునైటెడ్ సర్వీస్ కనెక్షన్ సాఫ్ట్‌వేర్‌లో కనెక్షన్ నంబర్, ఆధార్ వివరాలు, రేషన్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తు వివరాలను నమోదు చేశారు. జిల్లాలో 2,04,560 గృహ వినియోగ కనెక్షన్లు ఉంటే గృహజ్యోతి పథకం కోసం 1,85,118గృహవినియోగ కనెక్షన్ల వివరాలు నమోదుచేశారు. 19,442 కనెక్షన్లకు సంబంధించి కొందరు అందుబాటులో లేకపోగా, రేషన్ కార్డులు లేని వాళ్ల వివరాలు మొబైల్ నంబర్ల ఆధారంగా నమోదు చేశారు. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితవిద్యుత్ అందిస్తామని ప్రకటించారు. దీనిని ఏప్రామాణికంగా తీసుకుని అమలుచేస్తారు, ఒక ఇంటిలో రెండు మీటర్లు ఉంటే పథకం ఒక దానికే వర్తింపజేస్తారా, ఎన్ని మీటర్లుంటే అన్ని మీటర్లకు వర్తింపజేస్తారా అనే విషయమై స్పష్టతరాలేదు. మూడు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. మార్చి నెలలో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలుచేస్తామని, జీరో బిల్లులు వస్తాయన్నారు. ఉచిత విద్యుత్ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మొదట ఈ పథకాన్ని రేషన్‌కార్డు కలిగిన వారికే అమలు చేయనున్నారు. విద్యుత్‌సిబ్బంది సాఫ్ట్‌వేర్‌లో రేషన్ కార్డు, ఆధార్ నంబర్, యూనిక్ సర్వీస్ నంబర్ పొందుపర్చడంలో తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోకుండా చూడాలని, వాటిని తిరిగి సవరించుకునే అవకాశం కల్పించనున్నారు. సర్వీస్ నంబర్ల ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వనున్నారు. సవరణ ఎప్పుడు జరుగుతుందో మార్గదర్శకాల ప్రకారం ఆ మరుసటి నెలలో జీరో బిల్లులు రానున్నాయి. ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోలేని వాళ్లు ఎంపీడీవోలకు గానీ, తహసీల్దార్లకు గానీ చేసుకునే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని సీఎం ప్రకటించారు. కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ త్వరగా చేయాలని అర్హులైన వాళ్లు కోరుతున్నారు. రేషన్ కార్డు లేకుంటే ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందే అవకాశాలు లేకుండా పోతాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 500రూపాయలకే సబ్సిడీ గ్యాస్‌ను అమలు చేయనున్నామని ప్రభుత్వం ప్రకటించింది. మార్గదర్శ కాలను బట్టి గృహజ్యోతి ఎన్ని కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందో వేచిచూడాల్సిందే.

పోలియో చుక్కలు తప్పనిసరి వేయించాలి

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ - మార్చి 3 నుంచి 5 వరకు పల్స్ పోలియో

పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు చిన్నారుల నిండు జీవితానికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ అన్నారు. శనివారం తన ఛాంబర్‌లో పల్స్ పోలియో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో మార్చి 3 నుంచి మార్చి 5వరకు పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందని, 5 ఏళ్లలోపు పిల్లలు జిల్లాలో 62,500 మంది ఉన్నారని, పోలియో చుక్కలు వేసేందుకు 400బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. వీరందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అధికారులకు ఆదేశించారు. మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోలేని వారిని 4,5 తేదీల్లో ఇంటింటికి తిరిగి గుర్తించి చుక్కలు వేయాలన్నారు. దీనిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, డీడబ్ల్యూఓ రవూఫ్ ఖాన్, డీపీఓ ఆశాలత, పెద్దపల్లి ఆర్డీవో మధు మోహన్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీల కమిషనర్లు వెంకటేశ్, వేణు మాధవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృపాబాయి, ఆర్టీసీ అధికారులు కెఆర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు

జ్యోతినగర్, ఫిబ్రవరి 24 : రానున్న పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదు చేసేందుకు సంబంధిత సిబ్బంది కృషి చేయాలని అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ అన్నారు. శనివారం ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో నియోజకవర్గం పరిధిలోని బీఎల్‌వో, సూపర్‌వైజర్లు, డిగ్రీ, పీజీ, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో అదనపు కలెక్టర్ స్వీప్ యాక్షన్ ప్లాన్ గురించి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలో ఓటు హక్కుల వినియోగంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, ఓటు ప్రాధాన్యతను తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఓటు నమోదు చేసుకున్న ప్రతి విద్యార్థి తన ఓటు హక్కును వినియోగించుకునేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, రామగుండం, అంతర్గాం తహసీల్దార్లు కుమారస్వామి, రామ్మోహన్, అంతర్గాం, పాలకుర్తి ఎంపీడీవోలు అలీం, శశికళ, డిప్యూటీ తహసీల్దార్లు తిరుపతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 24: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న గుండం యాదగిరికి చెందిన ద్విచక్రవాహనం శనివారం అపహరణకు గురైందని బాధితుడు తెలిపాడు. మండల కేంద్రంలో మొదటి బైపాస్ రోడ్డు వద్ద ఓ దుకాణం ఎదుట బైక్ నిలిపి తాగునీటి పైపు లీకేజీ మరమ్మతు పనులు చేసేందుకు కందకంలో దిగానని తెలిపాడు. పనులు చేసి వచ్చి చూసే సరికి తన వాహనం కనిపించకుండా పోయిందని చెప్పాడు. చుట్టు పక్కల ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు గుండం యాదగిరి తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసులు ద్విచక్ర వాహనం కోసం ఆరా తీశారు. మండలంలోని గొల్లపల్లి వద్ద ఓ వ్యక్తి వాహనంతో పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర


స్వామివారి పల్లకి సేవ

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 24 : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం జాతర మహోత్సవం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను నిర్వహించిన వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. వేంకటేశ్వర, లక్ష్మి, పద్మావతి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలను జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర ను నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అమ్మాయి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా చందనోత్సవం


చందనంతో అలంకరించిన స్వామి వారు

బీర్‌పూర్, ఫిబ్రవరి 24: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారి సన్నిధిలో చందనోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అత్యంత భక్తి శ్రద్ధలతో మంత్రోచ్చారణల మధ్య లక్ష్మీ నరసింహ స్వామికి చందనాన్ని అద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎనగంటి సామ్రాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సిబ్బంది రాజయ్య, వెంటేష్ పాల్గొన్నారు.

వైభవంగా నృసింహస్వామి

రథోత్సవం

మొక్కులు చెల్లించుకున్న వేలాది మంది భక్తులు


స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 24: భక్తుల కొంగు బంగారం కోర మీసాల సామికి కోటి దండాలంటూ శనివారం కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీనృసింహస్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. దిగువనున్న కోనేరులో భక్తులు స్నానాలు చేసి దిగువ, ఎగువనున్న స్వామి వారిని దర్శించుకుని, బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే నల్లగొండ గుట్టకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. భక్తుల దర్శనార్థం ఆలయ ఛైర్మన్ సత్యనారాయణరావు, ఈవో వడ్లూరి అనూష, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారిని రథంపై భక్తుల దర్శనం కోసం ఆలయ ప్రాంగణంలో నిలిపారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవానికి సుమారు 50 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు అధికారులు భావిస్తున్నారు. గుట్టపైకి వచ్చిపోయే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ సమస్యను తొలిగించడంలో పోలీసులు ఇబ్బందులెదుర్కొన్నారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, పూడూర్ సింగిల్ విండో ఛైర్మన్ రమేష్, పలువురు అధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి ఆధ్వర్యంలో వాలంటీర్లు సేవలు అందించారు.


రథంపై స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు


బారులు తీరిన భక్తులు

ఘనంగా గోవిందరాజులస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ శాశ్వత ఛైర్మన్ గోవిందరావు దంపతులు


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, ఫిబ్రవరి 24 : మండలంలోని సనుగుల శివారులోని గుట్టపై వెలసిన గోవిందరాజుల స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకున్నారు. అనం తరం గోవిందరాజులస్వామి కల్యాణోత్సవం సంద్భంగా పట్టు వస్త్రలు సమర్పించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలయ శాశ్వత ఛైర్మన్ ఉప్పుగంటి శోభలత-గోవిందరావు దంపతులు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. జడ్పీ ఛైన్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసన సభ్యులు మదన్ మోహన్‌రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహా రావు, జడ్పీటీసీ నాగం కుమార్, సింగిల్ విండో ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, అంచ రాంరెడ్డి, మ్యాకల గణేష్, తోట ఆగయ్య, మ్యాకల ఎల్లయ్య, లింగంపెల్లి కరుణాకర్, దుమ్మ అంజయ్య, ఏనుగు శ్రీనివాస్. చింతపంటి రామస్వామి, భీమా రాజు కనకరాజు, గొట్టె ప్రభాకర్, బోజ్జ మల్లేశం,ముస్కు. ముకుందరెడ్డి, ముస్కు. పద్మ-మల్లారెడ్డి, సురేందర్‌రావు, నెతికుంట జలపతి, భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రుక్మిణీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

ముస్తాబాద్: మండలంలోని బందనకల్ వాసుదేవాశ్రమంలో రుక్మిణీ వేణు గోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు, ఆలయ అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎల్‌ఎండీలోకి దూకి వివాహిత ఆత్మహత్య

తిమ్మాపూర్, ఫిబ్రవరి24: మండలంలోని ఎల్‌ఎండీలోకి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, తిమ్మాపూర్ సర్కిల్ సీఐ కర్రె స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన కొడెం రమేష్, కొడెం నందిని కొంత కాలంగా మండలంలోని మహాత్మా నగర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. రమేష్ మహాత్మా నగర్‌లోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య నందిని(40)కి గత కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో అసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 22న మధ్యాహ్నం 2గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయిన నందిని 24వ తేదీ శనివారం దిగువ మానేరు జలాశయంలో శవమై తేలింది.


కొడెం నందిత (ఫైల్)

శనివారం జలాశ యం వద్ద మత్స్యకారులు మృతదేహాన్ని గుర్తించి ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలు ఇంటి నుంచి తప్పిపోయిన నందినిగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నందిని ఇంటి నుంచి వచ్చి ఎల్‌ఎండీ వద్ద ఫినాయిల్ తాగి ఎల్‌ఎండీలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదని మృతురాలు నందిని రాసిన లేఖ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు.

ఐదు నెలల చిన్నారి ప్రతిభ

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ముస్తాబాద్, ఫిబ్రవరి 24: ఐదు నెలల చిన్నారి అద్భుత ప్రతిభతో అందరినీ అబ్బురపరుస్తోంది. బుడిబుడి అడుగులు కూడా నేర్వని చిన్నారి మేధాశక్తితో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. ముస్తాబాద్ మండల కేంద్రంలోని వేముల సౌమ్య-సాగర్ దంపతుల ఐదు నెలల కూతురు సంవేద్య. వృత్తిరీత్యా సంవేద్య తండ్రి హైదరాబాద్‌లో సివిల్ ఇంజినీర్‌గా, తల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సంవేద్యకు రెండు నెలల వయస్సు నుంచే తల్లిదండ్రులు పలు రకాల వస్తువులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పండ్లు, జంతువులు, ఫ్లాష్ కార్డ్స్ వంటివి చూపించి వాటి పేర్లు చెప్పడం నేర్పించారు. ఐదు నెలలు రాగానే వస్తువులను, కార్డ్స్‌ను చూపించి పేరు చెప్పగానే వాటిని గుర్తిస్తోంది. ఆమె ప్రతిభకు నివ్వెరపోయిన వారు వీడియో తీసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కార్యాలయానికి పంపారు. వారు పరిశీలించి చిన్నారి సంవేద్య ప్రతిభను గుర్తించి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. చిన్నారి అద్భుత మైన ప్రతిభను కుటుంబ సభ్యులతోపాటు ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ రాజారాం, చింతో జు నారాయణ అభినందిస్తున్నారు.


సంవేద్యకు వచ్చిన రికార్డ్స్‌తో కుటుంబ సభ్యులు


చిన్నారి సంవేద్య

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 24: ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని రైల్వే ట్రాక్‌పై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడా అని తెలియాల్సి ఉంది. ఎన్టీపీసీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ట్రాక్టర్ కిందపడి బీహార్ యువకుడి మృతి

కోనరావుపేట, ఫిబ్రవరి 24 : బీహార్ రాష్ట్రానికి చెందిన సుమిత్ చౌదరి (20) అనే యువకుడు ట్రాక్టర్ కిందపడి శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన సుమిత్ చౌదరితోపాటు మరికొంత మంది సుద్దాల పత్తి మిల్లులో కొన్ని రోజులుగా పని చేస్తున్నారు. సుమిత్ చౌదరి స్నేహితుడు చందన్ కుమార్ శనివారం ఉదయం ట్రాక్టర్‌లో డీజిల్ పోయించి వెల్డింగ్ చేయించుకోవడానికి పత్తి మిల్లు నుంచి ట్రాక్టర్ తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో అక్కడే ఉన్న సుమిత్ చౌదరిని ఢీ కొట్టి ఈడ్చుకుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి స్నేహితులు కాటన్ మిల్ యజమానులకు తెలుపగా వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు అజయ్ కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

జగిత్యాల, ఫిబ్రవరి 24(గొల్లపల్లి): మండలంలోని చిల్వాకోడూర్ వంతెన వద్ద జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఓరగంటి (బక్కుల) లచ్చయ్య (62) శనివారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన కథనం మేరకు..నిరుపేద కుటుంబానికి చెందిన లచ్చయ్య గ్రామంలో కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిం చుకుంటున్నాడు. పనులు ముగించుకుని సైకిల్ పై ఇంటివైపు బయలుదేరాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దావన్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ది మహేష్ అనే యువకుడు జగిత్యాల నుంచి ధర్మారం వైపు వస్తూ చిల్వా కోడూర్ వంతెన వద్ద లచ్చయ్యను బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో లచ్చయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. మహేష్ వంతెన పక్కన ఉన్న ముళ్ల పొదల్లో ఎగిరి పడ్డాడు. లచ్చయ్యను స్థానికులు, కుటుంబ సభ్యులు 108లో జిల్లా ప్రధానాసుపత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందాడు. లచ్చయ్య కొడుకు రమేష్ ఫిర్యాదు మేరకు పెద్ది మహేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 24: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 20మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపరచగా కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, 4,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 18 మంది వాహన దారు లకు రూ. 29 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.


కొత్తగట్టులో స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు

వైభవంగా మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 24: భూదేవి, నీలాదేవి సమేత శ్రీమత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శంకరపట్నం మండలం కొత్తగట్టు గుట్టపై కొలువైన శ్రీమత్స్యగిరీంద్ర స్వామిని దర్శించు కోవడానికి భక్తులు పోటెత్తారు. శనివారం పౌర్ణమి జాతరకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పౌర్ణమి జాతరలో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేటిలో పుణ్యస్నానాలు ఆచ రించి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ మేరకు ఆలయ ఛైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఈవో సుధాకర్, ధర్మకర్తలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కమనీయం.. వేంకటేశ్వర స్వామి కల్యాణం


సింగాపూర్‌లో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 24: మండలంలోని సింగాపూర్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చిస్వామి వారి సేవలో తరించారు. స్వామి వారి కల్యాణానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దంపతులు హాజరై స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యే దంపతులకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు దంపతులు అందజేశారు.


స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 24: సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూరు శివారు గ్రామమైన తర్లాశిపల్లిలో 70 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. గ్రామంలోని ఓ వ్యవసాయ భూమిలో శనివారం వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తిస్తే 87126 56366 నంబరుకు ఫోన్ చేయాలని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.



వలసకార్మికుడిగా గుర్తింపు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 24: సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్‌లో పడి ఉన్న మృతదేహాన్ని బీహార్‌కు చెందిన వలసకార్మికుడు చాంద్ సదన్‌గా గుర్తించామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. సిరిసిల్లకు చెందిన మారుతి రైస్‌మిల్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అతిగా మద్యం తాగి బస్టాండ్ వద్ద మృతిచెంది ఉంటాడని అతడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గర్జనపల్లిలో వృద్ధుడి మృతి

వీర్నపల్లి, ఫిబ్రవరి 24: వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో న్యాత పెద్ద రాములు (65) మృతి చెందాడు. వృద్ధుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన న్యాత పెద్ద రాములు శనివారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులోని పాత చెరువుకుంట వ్యవసాయ భూమిలోని ఓ బావి వద్ద మేకల కాపరికి చెప్పులు, బట్టలు కనిపించడంతో అనుమానంతో బావిలోకి తొంగి చూశాడు. వృద్ధుడు పడి ఉండడాన్ని గమనించాడు. వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని పోలీసుల సహాయంతో రాములును బయటకు తీశారు. గాయాలతో ఉన్న రాములు అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు, రాములు కుమారుడు కిషోర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి

రాయికల్, ఫిబ్రవరి 24: రాయికల్ మండలం అయోధ్య గ్రామ శివారులో ఈ నెల 20న ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడగా పట్టణానికి చెందిన బత్తిని నాగరాజు (34) గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. నాగరాజు తన స్నేహితుడు చరణ్‌ను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఉప్పుమడుగు నుంచి రాయికల్‌కు వస్తుండగా అయోధ్య గ్రామ శివారులో వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో నాగరాజు మృతి చెందగా, చరణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నాగరాజు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 24: పట్టణంలోని విద్యానగర్‌లో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు జరిపారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 10,500ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

వేంటేశ్వరస్వామి ఆలయంలో హుండీల అపహరణ

రంగంలోకి క్లూస్ టీం.. వేలిముద్రల సేకరణ

ధర్మారం, ఫిబ్రవరి 24: మండలంలోని దొంగతుర్తిలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయంలో ఈనెల19న దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి గర్భగుడి ఆలయం తాళాలను పగులగొట్టారు. అందులో ఉన్న రెండు హుండీలను పగులగొట్టడానికి ప్రయత్నించారు. పగలకపోవడంతో రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. గ్రామంలో సమ్మక్క-సారక్క జాతర దృష్ట్యా హుండీల లెక్కింపు చేయలేదు. హుండీల్లో భక్తులు సమర్పించిన దాదాపు 50వేల రూపాయలు, బంగారు ఆభరణాలు ఉంటాయని అంచనా. రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి ప్రత్యేక క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. శనివారం కేసు నమోదు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ కోరారు.

317 జీవోపై ప్రభుత్వం సబ్ కమిటీ వేయడం హర్షనీయం

సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్

గన్నేరువరం, ఫిబ్రవరి 24: రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోపై ముగ్గురు మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో సబ్ కమిటీ వేయడం హర్షనీయమని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల లోపే ఉద్యోగ ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన 317 జీవోను పూర్తిగా అధ్యయనం చేసి ఉద్యోగ ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని ఉద్యోగులందరూ ఆశిస్తున్నారని అన్నారు. సీపీఎస్ రద్దు కోసం కూడా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వంటగ్యాస్ లీకై మంటలు: తప్పిన ప్రమాదం

శంకరపట్నం, ఫిబ్రవరి 24: శంకరపట్నం మండలం కన్నాపూర్‌లోని ఓ ఇంట్లో వంట గ్యాస్ లీకై మంటలు అంటుకొని సామగ్రి దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం దాసారపు రాధ ఇంటి నిర్మాణం చేసుకుంటూ తన తల్లి దేవునూరి పోచమ్మ ఇంట్లో ఉంటోందన్నారు. శనివారం సాయంత్రం రాధ వంట చేస్తుండగా రెగ్యులేటర్ దగ్గర గ్యాస్ లీకై ఒక్కసారి మంటలు ఎగిసి పడడంతో గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై గ్యాస్ సిలిండర్‌ను బయటవేశారన్నారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు ఇంటి పైకప్పు కూడా కాలినట్లు స్థానికులు తెలిపారు. రూ. 10వేల నగదుతో పాటు సుమారు రూ. 50వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.


బయట పడవేసిన సిలిండర్

ప్రహరీని కూల్చిన కేసులో కృష్ణగౌడ్‌పై పీటీ వారెంట్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 24: రేకుర్తిలో ఓ ప్రహరీని కూల్చివేసిన కేసులో కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్‌ను శనివారం కొత్తపల్లి పోలీసులు పీటీ వారెంట్‌పై జైలు నుంచి కస్టడీకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కరీంనగర్ మంకమ్మతోటకు చెం దిన ఎండీ అమీర్ అహ్మద్ అనే వ్యక్తి రేకుర్తిలోని సర్వే నంబరు 67లో ప్రహరీ నిర్మించగా దాన్ని సుధగోని కృష్ణగౌడ్ అక్రమంగా కూల్చివేశారని బాధితుడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో కృష్ణగౌడ్‌ను పీటీవారెంట్‌పై జైలు నుంచి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచి, మళ్లీ జైలుకు తరలించినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు సమర్పిస్తున్న భక్తులు



ఆర్టీసీ బస్సుల్లో తిరుగు ప్రయాణమైన భక్తులు



ఆర్టీసీ ప్రాంగణానికి వెళ్తున్న భక్తులు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరించి తల్లులకు మొక్కుతున్న భక్తులు

చివరి రోజూ.. అదే జోరు..



చిన్నారికి జంపన్న జలాలతో పుణ్యస్నానం..



తిరుగుప్రయాణంలో బై బై చెప్తున్న భక్తులు

- చివరిరోజూ మేడారానికి పోటెత్తిన భక్తులు
- తల్లులను దర్శించుకున్న స్పీకర్
- ప్రశాంతంగా దేవతల వనప్రవేశం
- ముగిసిన నాలుగు రోజుల జాతర
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు చివరి రోజు కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం తల్లులు వన ప్రవేశం చేయనుండడంతో వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలు మూలల నుంచి, అదేవిదంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీ ఎత్తున చేరుకున్నారు. దీంతో క్యూలైన్లన్నీ కిటకిలాడాయి. గద్దెల ప్రాంగణం ఇసుకవేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసి పోయింది.



తల్లుల వనప్రవేశం

తల్లుల వనప్రవేశం ప్రశాంతంగా జరిగింది. శనివారం సాయంత్రం 5 గంటలకు సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలుకలగుట్టకు, సారలమ్మను కాక సారయ్య కన్నెపెల్లికి, అలాగే గోవిందరాజులను కొండాయి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు తరలించారు. దీంతో మేడారం మహాజాతర ముగిసింది.

ప్రముఖుల రాక

మేడారానికి శనివారం కూడా ప్రముఖుల తాకిడి కొనసాగింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సమ్మక్క, సారలమ్మను దర్శించి మొక్కులు చెల్లించారు. హెలిక్యాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ స్వాగతం పలికారు. స్పీకర్ తొలుత తులాభారం ద్వారా ఎత్తుబంగారాన్ని సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ సైతం వనదేవతలను దర్శించుకున్నారు.

ధన్యవాదాలు తెలిపిన సీతక్క

జాతరను విజయవంతం చేయడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ శాఖల అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. జాతర నిర్వహణకు అత్యధిక నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఇతరశాఖల అధికారులను అభినందించారు.

సంప్రదాయ ఊరేగింపు

సమ్మక్క, సారలమ్మ జాతర ముగుస్తుండడంతో చివరి రోజు శనివారం మేడారంలో ఆదివాసీలు సంప్రదాయ ఊరేగింపు నిర్వహించారు. వివిధ కోయ జాతుల వారు సుమారు 300 మంది సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం సమ్మక్క గద్దెల వద్దకు చేరుకున్నారు. ఆదివాసీ పద్ధతిలో పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కొమ్ముబూరలతో సంప్రదాయ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. శివసత్తులు పూనకాలతో శిగాలూగారు.

ముగిసిన మహాజాతర

అంగరంగ వైభవంగా సాగిన మేడారం మహాజాతర శనివారం ముగిసింది. నలుగురు దేవతల వనప్రవేశంతో నాలుగు రోజుల సంరంభానికి తెరపడింది. భక్తులు తిరుగుబాట పట్టడంతో మేడారంలో గుడారాలన్నీ ఖాళీ అయ్యాయి. జన ఘోషతో హోరెత్తిన జాతర ప్రాంతం తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి జారిపోయింది. 'రెండేళ్లకు మళ్లీ వస్తాం తల్లీ.. కరుణించు' అంటూ మొక్కుకుంటూ భావోద్వేగంతో స్వగ్రామాల బాట పట్టారు.



మేడారం వెళ్లే రహదారిపై బారులుదీరిన వాహనాలు

ట్రస్మా అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 24: నియోజకవర్గంలో ట్రస్మా అభివృద్ధికి కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన ట్రస్మా జిల్లా, రామగుండం ప్రతినిధులు శనివారం గోదావరిఖనిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మక్కాన్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ ట్రస్మా భవనం కోసం స్థలాన్ని ఇప్పించేందుకు కృషి చేస్తానని, సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు కంది రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి చందుపట్ల తిరుపతిరెడ్డి, రామగుండం అధ్యక్షకార్యదర్శులు సమ్మారావు, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, అంజారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బోగ నాగరాజు, పీ.సీతారామాచార్య, బి. తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ కోరారు. శనివారం ఆయన పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మంథని నియోజకవర్గం మీదుగా ఈనెల 25న పెద్దపల్లి నియోజకవర్గంలోని సబ్బితంలో మొదలై రంగాపూర్, రాఘవపూర్ మీదుగా, పెద్దపల్లి జెండా చౌరస్తా చేరుకుంటుందన్నారు. ఈసందర్భంగా కార్నర్ మీటింగ్ ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, అసెంబ్లీ ప్రబారి పోచం, కన్వీనర్ దాడి సంతోష్, పోల్సాని సంపత్‌రావు, మండల అధ్యక్షుడు కావేటి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో స్వల్ప వర్షం

ధర్మారం, ఫిబ్రవరి 24: ధర్మారంలో శనివారం మధ్యాహ్నం స్వల్పంగా వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చల్లటి వాతావరణం ఏర్పడి వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వాతావరణం చలిగా మారింది.

మాదిగ మహాగర్జనను విజయవంతం చేయండి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 24: టీఎస్ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన మాదిగ మహాగర్జన సభను మాదిగ కులస్థులు, విద్యావంతులు, మేధావులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు యాసర్ల రాజ్‌కుమార్(తిమోతి) కోరారు. శనివారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో మహాగర్జన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎంఆర్‌పీఎస్ నాయకులు కొట్టెపల్లి దుర్గాప్రసాద్, వడ్లూరి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు మాచర్ల శ్రీనివాస్, ఈర్ల ప్రేమ్‌కుమార్, మేడి ప్రవీణ్, మహిళ నాయకురాలు సుందిళ్ళ రుణుక, కండె శ్వేతా, రోజా తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ నిరసన ప్రదర్శన

జ్యోతినగర్, ఫిబ్రవరి 24 : రైతులపై పోలీసులు కాల్పులు జరపడంపై ఐఎఫ్‌టీయూ శనివారం ఎన్టీపీసీలో నిరసన వ్యక్తం చేసింది. మేడిపల్లి సెంటరులో నల్ల జెండాలు ప్రదర్శించి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఇ.నరేష్, ప్రధాన క్యాదర్శి లుక శంకర్, నాయకులు బుచ్చన్న, రవి, కుమార్, రాజేశం, వసంత్, మహేందర్, శ్రావణ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో నాయకులు నల్లజండాలతో నిరసన తెలిపారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌లు, బుచ్చమ్మ, రమేష్, కాంతయ్య, సతీష్, లింగయ్య, ప్రకాష్, ప్రేమ్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

అధికారికి సన్మానం

రామగిరి, ఫిబ్రవరి 24: సింగరేణి ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో సర్వే అధికారిగా పనిచేసి పదోన్నతిపై వెళ్తున్న జైనుల్లాబద్దిన్‌ను శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ-3, ఏపీఏ ఇన్‌చార్జి జీఎంలు రాధాకృష్ణ, నాగేశ్వర్‌రావు ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు రఘుపతి, వెంకటరమణ, చంద్రశేఖర్, కర్ణ, రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఐలయ్య, నాగేశ్వర్‌రావు, రాజేశ్వరిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ, పాలకుర్తి, జూలపల్లి, రామగిరి, ముత్తారం, మంథని, ఫిబ్రవరి 24: కాంగ్రెస్ పార్టీ మంథని నియోజకవర్గ నాయకుడు, శ్రీపాదరావు ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు జన్మదినం సందర్భంగా శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి, విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు పంపిణీ చేశారు. కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

రూ.26.49 కోట్లతో పెద్దపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి

- రేపు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



పెద్దపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి నమూనా చిత్రం



స్టేషన్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకంలో భాగంగా 26 కోట్ల 49 లక్షల రూపాయల అంచనాతో చేపట్టనున్న పెద్దపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు ఈనెల 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా రిమోట్‌తో శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కొత్తపల్లి- కొలనూర్ మధ్య ఎల్‌సీ 35వ గేట్ ఉప్పరపల్లి వద్ద నిర్మించిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిని కూడా ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ పథకం రెండో దశలో దేశవ్యాప్తంగా 554 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా పెద్దపల్లి స్టేషన్ ఉండడం గమనార్హం. మొదటి దశలో జిల్లాలోని రామగుండం, కరీంనగర్ రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు 25 కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరుచేయగా, ఆ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను మోదీ గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించారు. పెద్దపల్లి రైల్వేస్టేషన్‌ను రెండో దశలో చేర్చినప్పటికీ, ఆరు మాసాల నుంచే ఇక్కడ పనులు నడుస్తున్నాయి. మరో ఆరు మాసాల్లో పెద్దపల్లి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి.

రామగుండానికి మహర్దశ

- నగరాభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధులు
రూ.100కోట్లు మంజూరు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 24: రామగుండం నగరపాలక సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేసిన విజ్ఞప్తి మేరకు టీయూఎఫ్ఐడీసీ ద్వారా ఈ నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ కార్యదర్శి, టీయూఎఫ్ఐడీసీ ఎండీ దాన కిశోర్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను ఆమోదిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

నగరంలో వ్యాపార కేంద్రాలు, ప్రధాన వీధుల ఆధునీకరణతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన నాలాలను ఆధునికీకరించేందుకు నిధులు మంజూరు అయ్యాయి. ముఖ్యంగా వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, ఉల్లిగడ్డల బజార్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వన్‌సైడ్ లైటింగ్‌కు రూ.29.5కోట్లు మంజూరయ్యాయి. గోదావరిఖనిలో మౌలిక వసతులు లేక వ్యాపారాలు తగ్గుతున్నాయనే, దీనికి వ్యాపార కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఇచ్చిన హామీ మేరకు ఈ వ్యాపార కేంద్రాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

రామగుండానికి పూర్వవైభవం తీసుకరావడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి నిధులు తీసుకువచ్చి నగర పాలక సంస్థను సుందర నగరంగా అభివృద్ధి చేస్తాం. గతంలో నిధులు లేకుండా జీవోలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు. ఇప్పుడు నేను ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయగానే స్పందించి నిధుల విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. వ్యాపార కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యాపారాలు పెరిగి ప్రజలకు మరింత ఉపాధి లభిస్తుంది. నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతి కల్పించనున్నాం. భవిష్యత్‌లో మరిన్ని నిధులు మంజూరు చేయిస్తా.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నమ్మవద్దు..

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



వెంకటరమణారెడ్డికి తట్టా చెమ్మస్ బహూకరిస్తున్న బీజేపీ నాయకులు



మంథనిలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

గోదావరిఖని, మంథని, ఫిబ్రవరి 24: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నమ్మవద్దని, దేశం కోసం పనిచేసే నాయకుడు కావాలో.. దేశాన్ని దివాళా తీసే నాయకులు కావాలో పార్లమెంట్‌లో ఎన్నికల్లో ప్రజలు ఆలోచించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర శనివారం రామగుండం, మంథని నియోజకవర్గాల్లో కొనసాగింది. గోదావరిఖని, మంథనిల్లో జరిగిన ర్యాలీల్లో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు చెప్పి కేసీఆర్ లక్షన్నర కోట్లు మింగితే కాంగ్రెస్ గెలిచి మూడు నెలలు కావస్తున్నా ఒక్క బస్సు ఫ్రీ తప్ప మరేమి చేయలేదన్నారు. ఇప్పుడేమో తెలంగాణలో 17ఎంపీ సీట్లు గెలిస్తే కానీ హామీలు నెరవేర్చలేమని రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఎస్‌సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో పోరు యాత్రను నిర్వహించామని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓపెన్‌కాస్టులను మూసివేసి అండర్‌గ్రౌండ్ గనులను చేస్తానని చెప్పినా చేయలేదని, గోదావరిఖని ప్రాంతం బొందల గడ్డగా మారిందని ఆరోపించారు. యాత్రకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి స్వాగతం పలికారు. పెద్దపల్లి పార్లమెంట్ ప్రబారి కొప్పు భాషా, జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బల్మూరి వనిత, మేరుగు హన్మంతుగౌడ్, వడ్డేపల్లి రాంచందర్, రావుల రాజేందర్, క్యాతం వెంకటరమణ, అయోధ్య రవీందర్, తోట కుమారస్వామి, పైతరి రాజు, కోమళ్ల మహేష్, మిట్టపల్లి రాజేందర్, రేణుక, ప్రదీప్‌రావు, సత్యప్రకాష్, క్రాంతి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళ సాధికారిక ఓ ఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. శనివారం మండలంలోని రాఘవపూర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, కళాశాల ప్రిన్సిపాలః అఫ్రా జబీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ధర్మారం, ఫిబ్రవరి 24: ధర్మారం మండల కేంద్రంల గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 24మంది విద్యార్థినిలకు శనివారం మలబార్ చారీటబుల్ ట్రస్టు ద్వార రూ. 1,96,000 స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కళాశాలలో ఒక్కొక్కరికి రూ. 8వేలు, 10వేల చొప్పున స్కాలర్‌షిప్‌లను కార్పోరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) మహిళ సాధికారితలో బాగంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనంత రామకృష్ణ, ట్రష్టు ప్రతినిధులు విక్కమ్, కృష్ణ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

రామగిరి, ఫిబ్రవరి 24: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు బత్తిని నర్సయ్యకు సింగరేణి చిరు ఉద్యోగి రేండ్ల కుమారస్వామి రూ. 5వెల ఆర్థిక సహయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు పడాల మొగిలి, కాటశంకర్, ముత్యం నాగరాజు, గిరవేన రాములు, కనకయ్య, బొంకూరి పోశం, శేఖర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ముత్తారం సింగిల్‌విండో చైర్మన్‌గా యాదగిరిరావు

ముత్తారం, ఫిబ్రవరి 24: పీఏసీఎస్ చైర్మన్‌గా అల్లాడి యాదగిరిరావును వైస్ చైర్మన్‌గా ఎలువక కొమురయ్యను ఎన్నుకున్నట్లు జిల్లా సహకార సంఘం అధికారి శ్రీమాల ప్రకటించారు. 13 మంది డైరెక్టర్లకు పది మంది డైరెక్టర్లు హాజరై అల్లాడి యాదగిరిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంథని సీఐ రాజు గౌడ్ ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ముత్తారం మాజీ జెడిఃటిసి నాగినేని జగన్ మోహన్ రావు మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మద్దెల రాజయ్య వెల్మారెడ్డి సంజీవరెడ్డి గుజ్జ లింగారావు రామగిరి మహేందర్ పాల్గొన్నారు

ఆటో డ్రైవర్లకు సైబర్ నేరాలపై అవగాహన

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 24: గోదావరిఖని బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సైబర్ క్రైమ్ సీఐ జె.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాల బారిన పడి అకౌంట్‌లోని డబ్బులను పోగొట్టుకుంటే 1930 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, కానిస్టేబుళ్లు ఓ.శ్రీనివాస్, నిమ్మతి శ్రీనివాస్, ప్రశాంత్, ఆటోడ్రైవర్లు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఓదెల, ఫిబ్రవరి 24: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి అన్నారు. మండలం లోని కనగర్తిలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా ఉన్నత విద్యపై దృష్టి పెట్టాలన్నారు. వ్యక్తులను పరిశీలించి స్నేహం చేయాలన్నారు. గంజాయి, మద్యం ప్రతి వ్యక్తికి ప్రాణాంతకమని, వీటికి యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా రవియాదవ్

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 24: బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కోశాధికారిగా మండలంలోని పెగడపల్లికి చెందిన తాత రవియాదవ్‌ను ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనందగౌడ్ నియమించారు. బీజేపీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని రవియాదవ్ తెలిపారు.

ఆర్జీ-2లో అసిస్టెంట్ చైన్‌మెన్ పరీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 24: ఆర్జీ-2 ఏరియాలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ చైన్‌మెన్ పోస్టులకు శనివారం యాజమాన్యం పరీక్షలు నిర్వహించింది. ఏరియా జీఎం సూర్యనారాయణ ప్రశ్నాపత్రాలను ఓపెన్ చేసి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎస్వోటూ జీఎం రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అధికారులు బుక్య దేశాయి, వేణుగోపాల్, ఫణీంద్రలు పరీక్ష నిర్వహణ బాధ్యతలు చూశారు.